క్లుప్తంగా

కొల్లాపూర్ తరలిన ఫొటోగ్రాఫర్లు

వీపనగండ్ల: నియోజకవర్గ కేంద్రమైన కొల్లాపూర్ పట్టణంలో ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘ భవన నిర్మాణ భూమి పూజకు ఆదివారం మండల కేంద్రం నుంచి ఫొటోగ్రాఫర్లు తరలివెళ్లారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తాలూకా స్థాయి ఫొటో, వీడియో గ్రాఫర్లకు ఉపయోగపడాలన్న సదుద్దేశంతో భవన నిర్మాణానికి స్థలం, నిధులు కేటాయించారు. కొల్లాపూర్ డివిజన్ ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఉమ్మడి మండలాల ఫ్రెండ్స్ ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రాంబాబు, అభి, గఫూర్, శేఖర్, మల్లయ్య, శేషు, శివ, గోపిలు తెలిపారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

అమరచింత: పట్టణంలోని పలు వార్డుల్లో నిండుకున్న మురుగు కాల్వలను సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా వార్డుల ప్రజలు పేర్కొన్నారు. వర్షాకాలంలో కాల్వల్లో మురుగునీరు నిండుకోవడం, ,చెత్తాచెదారం నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమల బెడద పెరిగిందని తెలిపారు. మురుగు కాల్వలను పరిశుభ్రం చేయాలని సంబంధిత మున్సిపల్ సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ చొరవ తీసుకొని మురుగు కాల్వల శుభ్రం చేయించి దోమల నివారణ చేయాలని కోరుతున్నారు.

స్త్రీలను గౌరవిస్తేనే అభివృద్ధి సాధ్యం

వనపర్తిటౌన్: స్త్రీలను గౌరవిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందని రెవరెండ్ పాస్టర్ ఐజె మార్తమ్మ, స్త్రీల చైర్మన్ డీజే సరోజమ్మ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎంబీ ఒలివ్ చర్చిలో స్త్రీల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంబీ ఒలివ్ చర్చిలో ప్రతి ఏడాది ఆగస్టు నెలలో ఓ స్త్రీల ఆదివారం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో స్త్రీల సమాజం సెక్రటరీ బీపీ క్లారా, ట్రెజరర్, మాజీ కౌన్సిలర్ పీడీ కమలమ్మ, సువేదమ్మ, ప్రమీల, కనికరమ్మ, సంఘ పెద్దలు నిర్మల, పీజే మరియమ్మ, చర్చి చైర్మన్ పీడీ సుకన్య, వైస్ చైర్మన్ మార్టిన్ లూథర్, ట్రెజరర్ అమృత్‌సాగర్, రోనాల్డ్, ఏసయ్య, స్వామి దాస్, కళానందం, జయనందం, యోబు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే శిక్షణ



ఖిల్లాఘనపురం: డప్పు కళాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు కొత్త దరువులు నేర్పించడానికి సంఘం ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించామని తెలంగాణ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బేజిని మైబు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కళాకారులకు మెళకువలు నేర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఏళ్లుగా పండుగలు, జాతరలు, రాజకీయ పార్టీల ఊరేగింపులు, చావు బతుకులు ఇలా ప్రతి కార్యక్రమానికి డప్పు కొడుతూ జీవనం సాగిస్తున్న కళాకారుల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేందుకు సంఘం పని చేస్తుందని.. అందులో భాగంగానే మండల కేంద్రంలో రెండ్రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి రంగన్న, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కొండయ్య, ఖిల్లాఘనపురం మండల నాయకులు కుర్మయ్య, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై వీధికుక్కల దాడి

పెబ్బేరు: మండల పరిధిలోని రంగాపూర్‌లో ముగ్గురు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రంగాపూర్ గ్రామం ఎస్సీ కాలనీలో కావ్య, భాను, హర్షిత ముగ్గురు చిన్నారులు ఆదివారం సెలవు కావడంతో వీధిలో ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో వీధి కుక్కలు వచ్చి ఒకేసారి వారిపై దాడి చేసి గాయపర్చాయి. దీంతో ఎంపీటీసీ, సర్పంచ్ గట్టయ్య, పంచాయతీ కార్యదర్శి రాకేష్‌లకు ఈ విషయం తెలియడంతో వెంటనే చిన్నారులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గ్రామంలోని వీధి కుక్కలను పట్టుకుంటామని సర్పంచ్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు నిరంతర పోరాటం

కొల్లాపూర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ కోసం నిరంతరం పోరాడుతామని దండోరా జిల్లా నాయకుడు బచ్చలకూర లక్ష్మణ్ మాదిగ అన్నారు. ఆదివారం మండలంలోని మాచినేనిపల్లిలో గ్రామస్థాయి దండోరా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీ ఇచ్చి మాదిగలను మోసం చేశాయన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీటీ రోడ్డు శంకుస్థాపనకే పరిమితం

- నిధులు మంజూరైనా..
- ముందుకు సాగని పనులు



అప్పారెడ్డిపల్లిలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం



పర్వతాపురం మట్టిరోడ్డు

ఖిల్లాఘణపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి ఆముదం బండ తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా, టెండర్ తీసుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టక పోవడంతో పలు గ్రామాలు, గిరిజన తండాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌తో వెంటనే పనులు చేయించాలని కోరుతున్నారు.

రూ.4.70 కోట్ల మంజూరు..

మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి పర్వతాపురం, గార్లబండ తండా మీదుగా బీటీ రోడ్డు నిర్మాణం కోసం వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అధికారులతో సర్వే చేయించి నివేదికను ప్రభుత్వానికి పంపించారు. దీంతో పీఎంజీఎస్‌వై పథకం ద్వారా రూ.4.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండరు ప్రక్రియ పూర్తి అయి టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరు ఇప్పుడు పనులు చేయడం లేదు. ఇప్పటికైనా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

2 గ్రామాలు 4 తండాలకు ప్రజలకు మేలు..

మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి ఆముదంబండ తండా వరకు 7.3 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు, మార్గమధ్యలో పర్వతాపురం శివారులో ప్రత్యేకంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిధులు మంజూరయ్యాయి. ఇందుకోసం 2021 జూన్ 08వ తేదీన వ్యవసాయ శాఖమంత్రి నిరంజన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు పూర్తయితే అప్పారెడ్డిపల్లి, పర్వతాపురం, షాపురం ఊరంచు తండా, ఆముదంబండ తండా, కోతులకుంట తండా, కర్నెతండాల ప్రజలకు రవాణాకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఈ విషయమై పంచాయతీ రాజ్ శాఖ ఏఈ కబీర్‌దాస్‌ను వివరణ కోరగా ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

రోడ్లకు నిధులు మంజూరు



శ్రీ రంగాపురంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గాయత్రి

పెబ్బేరు రూరల్: శ్రీ రంగాపురం మండలంలో నాగరాల, నాగసానిపల్లి గ్రామాల లింక్ రోడ్లకు నిధులు మంజూరైనట్లు ఎంపీపీ గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక సర్పంచులతో కలిసి ఆదివారం నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాగసానిపల్లి నుంచి శ్రీరంగాపురం వరకు బీటీ రోడ్డుకు రూ.1.30 కోట్లు, నాగరాల గ్రామం 2వ సెంటర్ నుంచి 3వ సెంటర్ వరకు బీటీ రోడ్డుకు రూ.1.25కోట్లు మంజూరైనట్లు తెలిపారు. శ్రీరంగాపురం మండలంలోని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ జగనాథంనాయుడు, సర్పంచులు ఆంజనేయులు, వెంకటేశ్వర్‌రెడ్డి, నిర్మల, కోఆప్షన్ సభ్యులు ఎండీ ఆరీఫ్, బీఆర్ఎస్ నాయకులు పృథ్వీరాజు, వెంకటస్వామి, రాధాకృష్ణ, మహేష్‌గౌడ్, కురుమయ్య ఉన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



బిచ్చయ్యను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జూపల్లి

పాన్‌గల్: మండలంలోని బహదూర్‌గూడెం గ్రామానికి చెందిన మినిగ బిచ్చయ్య కిడ్నీ సమస్య వల్ల హైదరాబాదు నిమ్స్‌లో చికిత్స పొందుతుండగా మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని ఆయన డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ..

పాన్‌గల్: బుసిరెడ్డిపల్లికి చెందిన వైస్ ఎంపీపీ కవిత అత్త బాలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆదివారం దశదిన కర్మకు కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి హాజరై ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, బీఆర్ఎస్ నాయకులు దేవేందర్‌నాయుడు, దశరథనాయుడు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌ఐని సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు



శ్రీ రంగాపురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెబ్బేరు రూరల్: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరంగాపురం మండల నూతన ఎస్‌ఐ వెంకటస్వామిని పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. పూల మాల వేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, సింగిల్‌విండో అధ్యక్షుడు జగనాథ నాయుడు, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ఆరీఫ్, సర్పంచులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు, రాధాకృష్ణ, పృథ్వీరాజు, కురుమ య్య, మహేష్‌గౌడ్, జలీల్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ఆర్టీసీ ఉద్యోగుల లేఖ



ప్రభుత్వానికి రాసిన లేఖను చూపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

వనపర్తిటౌన్: ఇటీవల ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వంలో విలీనం చేసింది. దీంతో టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ ఉద్యోగులకు అందుతున్న లాభ నష్టాలపై అధ్యాయనం చేసి తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు అందాల్సిన బెనిఫిట్‌లపై వనపర్తి ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని డిపో ఎదుట లేఖను విడుదల చేసి మేనేజర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ వనపర్తి డిపో కార్యదర్శి ఏ కృష్ణయ్య, అధ్యక్షుడు జేవీ స్వామి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయడం ద్వారా మనకందాల్సిన బెనిఫిట్‌లు అందుతాయన్నారు. కార్యక్రమంలో రీజియన్ ప్రచార కార్యదర్శి ఏ క్రాంతి కుమార్, రీజియన్ నాయకులు ఎండీ ఖయ్యూం, డిపో సహాయ కార్యదర్శి బీ కృష్ణయ్య, నాయకులు కే శ్రీనివాసులు, కే కురుమయ్య, నాగేశ్వర్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



చిన్నమారులో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బీరం

చిన్నంబావి: కొల్లాపూర్ నియోజకవర్గం ప్రగతిని చూసి వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నమారు గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులకు ఎమ్మెల్యే బీరం బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లాపూర్ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. సీఎం కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్‌ల సహకారంతో భవిష్యత్‌లో మరింత ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకటరమణమ్మ, పెద్దమారు సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ మద్దిలేటి, చిన్నారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బగ్గరి నరసింహారెడ్డి, శివారెడ్డి, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

పాన్‌గల్: బైక్‌ను కారుతో ఢీకొట్టిన ప్రమాదంలో కారు డ్రైవర్‌పై కేసు నమోదైన ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వేణు కథనం ప్రకారం.. మండలంలోని దొండాయిపల్లికి చెందిన ముత్యాల్‌రెడ్డి ఈనెల 3వ తేదీన వనపర్తి నుంచి దొండాయిపల్లికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో దవాజిపల్లితండా సమీపంలో వీపనగండ్ల మండలం కల్వరాల నుంచి వనపర్తి వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో ముత్యాల్‌రెడ్డికి గాయాలయ్యాయి. అతని భార్య భాగ్యమ్మ ఆదివారం ఫిర్యాదు చేసింది. దీంతో ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ రవికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన రైతు మదుగని కేశవులుకు చెందిన ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధితుడి కథనం ప్రకారం.. కేశవులు పొలం పక్కన రైతు వేరుశనగ పంట రక్షణ కోసం రాత్రివేళల్లో విద్యుత్ తీగలను అమర్చాడు. ఆ తీగలకు తగిలిన ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.40 వేలు ఉంటుందని, ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. అధికారులు స్పందించి తనను ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన కోరారు.

కేజ్‌వీల్స్‌తో దెబ్బతింటున్న రోడ్లు



వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాలకు ఇటీవల నిర్మించిన బీటీ రోడ్లపై ట్రాక్టర్ యజమానులు విచ్చల విడిగా కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లను నడపడంతో బీటీ రోడ్లు పాడవుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వీపనగండ్ల నుంచి గోవర్ధనగిరి, తూకుంట క్రాస్ రోడ్డు నుంచి వల్లభాపురం, తెల్లరాళ్లపల్లి క్రాస్‌రోడ్డు వరకు నిర్మించిన బీటీ రోడ్డుపై రైతులు పొలాలను దున్నేందుకు ట్రాక్టర్లకు కేజ్ వీల్స్ అమర్చుకుని రోడ్లపైకి వస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భీమా కాల్వలో జమ్ము తొలగింపు



కాల్వలో పేరుకుపోయిన జమ్మును తొలగిస్తున్న రైతులు

పాన్‌గల్: పంటల సాగుకు ముందు సాగునీటి కాల్వలో పేరుకుపోయిన జమ్ము, మట్టిని తొలగించాలని పలుమార్లు రైతులు మొరపెట్టుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తప్పని పరిస్థితుల్లో మండలంలోని బుసిరెడ్డిపల్లి రైతులు ఆదివారం భీమా కాల్వలో పేరుకుపోయిన జమ్ము, మట్టిని స్వచ్ఛందంగా తొలగించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఉపాధి హామీ పని ద్వారా కాల్వలో పేరుకుపోయిన జమ్ము, మట్టిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కూలిన పైకప్పు.. తప్పిన ప్రమాదం



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తకోట రూరల్: మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పార్వతమ్మ మిద్దె ఆదివారం ఉదయం అకస్మాత్తుగా కూలిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి మిద్దె పూర్తిగా తడిసిపోవడంతో ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు బయట ఉన్న సమయంలో ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. ఇంట్లో ఉన్న వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, బట్టలు పూర్తిగా నాశనమయ్యాయి. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భీంరెడ్డికి విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే గృహలక్ష్మి పథకంలో ఇల్లు మంజూరు చేద్దామని భరోసా ఇచ్చినట్లు భీంరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశంతో కూలిపోయిన ఇంటిని బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఆమె భర్త ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆమె ఇప్పుడు కుమారుడు భరత్, కూతుళ్లు అంజలి, మనీషాలతో ఉంటోంది. ఒక్క నిమిషం ఇంట్లో నుంచి వారు బయటకు రాకుంటే అందరూ సజీవసమాధి అయ్యేవారని స్థానికులు పేర్కొన్నారు. ఇల్లు పరిశీలించిన వారిలో యుగంధర్‌రెడ్డి, జగదీష్, ఉపసర్పంచ్ శివప్రసాద్, శ్రీనివాసులు, కృష్ణయ్య, రైతుబంధు కో ఆర్డినేటర్, భరత్‌యాదవ్, ఫీల్డ్ అసిస్టెంట్ సీత మొగులన్న, అబీబ్ ఉన్నారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు



చిక్కుడు తోట

పాన్‌గల్: సంప్రదాయ పంటలకు భిన్నంగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెడితే మంచి లాభాలు సాధించవచ్చని నిరూపిస్తున్నారు పాన్‌గల్‌కు చెందిన రైతు మోహన్‌రెడ్డి, కృష్ణవేణి దంపతులు. ఎకరన్నర పొలంలో కూరగాయలు పండిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు. తక్కువ పెట్టుబడితో వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. బెండ, చిక్కుడు, కాకర, ఆకు కూరలు సాగు చేసి దశలవారీగా పంటలు చేతికి వచ్చేలా పండిస్తున్నారు. పెట్టుబడికి ఇప్పటి వరకు రూ.20 వేలు ఖర్చు చేయగా, ఖర్చులన్నీ తీయగా రోజూ రూ.వెయ్యి వరకు మిగులుతుందన్నారు. తోటల సాగులో వారిద్దరే పనిచేస్తున్నట్లు తెలిపారు. పండించిన ఆకు కూరలు, కూరగాయలను మండల కేంద్రంలోని సంతతో పాటు చుట్టుపక్కల గ్రామాల సంతలకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో సాగు చేయడం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా నేరుగా వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కేవలం వరినే నమ్ముకొని పంట నష్టపోకుండా, నిత్యం ఆదాయం పొందేలా కూరగాయల సాగుపై మిగతా రైతులు దృష్టి పెడితే సాగులో మంచి లాభాలు పొంద వచ్చని నిరూపిస్తున్నారు.

నెల రోజుల నుంచే ఆదాయం..



వేసవిలో కష్టం అనుకోకుండా దుక్కి దున్ని కూరగాయల సాగు కోసం సిద్ధం చేసుకున్నాను. తొలకరి జల్లులతోనే విత్తనాలు వేసుకోవడంతో నెల రోజుల నుంచే ఆదాయం పొందాను. కూరగాయల సాగు లాభాసాటిగా ఉంది.

– కృష్ణవేణి, పాన్‌గల్

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



మదనాపురంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వడ్డెరలు

మదనాపురం: సంచార జీవితం, కాయకష్టంతో బతుకుతున్న వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆదివారం వడ్డెరలు డిమాండ్ చేశారు. ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఆదివారం వనపర్తిలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి మదనాపురం మండల కేంద్రం నుంచి వడ్డెర కులస్తులు తరలి వెళ్లారు. అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం చేస్తామన్నారు కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు వడ్డె కృష్ణ, వడ్డె బాలు, సాంతన్న, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న జూపల్లి అనుచరులు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 23వ వార్డుకు చెందిన గుడిమోని బాలమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో ఆదివారం మాజీ మంత్రి చిన్నారెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగరాజు ద్వారా రూ.5వేలు అందజేసినట్లు తెలిపారు. 21వ వార్డుకు చెందిన తాపి మేస్త్రీ ద్యారపోగు రమేష్ మరణించడంతో కౌన్సిలర్ బి వెంకటేష్, మాజీ కౌన్సిలర్ గంధం కొండలయ్య, వనపర్తి అసెంబ్లీ కోఆర్డినేటర్ డీ వెంకటేష్‌లు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దహన సంస్కారాలకు రూ.5వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమాలలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాబా, అబ్దుల్లా, విజయ్, నాగరాజు, నాగన్న ఉన్నారు.

చిన్నంబావి: మండలంలోని పెద్దమారూర్‌కు చెందిన కేతపాగ సవారమ్మ వారం రోజుల క్రితం మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జూపల్లి అనుచరులు ఆదివారం సవారమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, వారికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కొప్పునూరు సింగిల్ విండో వైస్ చైర్మన్ విద్యాసాగర్‌రావు, మాజీ సర్పంచ్ ఉసేనయ్య, మాజీ ఎంపీటీసీ భీముడు, చుక్కారావు, హనుమంతురావు, రమణయ్య, కుమ్మరి గోపాల్, మహేష్‌రావు, వెంకటేశ్వర్‌రావు, నరసింహ, నరహరి, తిక్కన, శాలుబాషా, శివన్న, ముంతయ్య, కర్ణయ్య, నరేష్ యాదవ్, శ్రీనివాసులు, బుడ్డన్న, ఉసేనయ్య పాల్గొన్నారు.

తాటిపాములలో..

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో మంగళి శారదమ్మ మట్టిమిద్దె ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. దీంతో స్పందించిన మేఘారెడ్డి మండల యువసేన నాయకులు తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన రూ.5వేలు బాధితమహిళకు పంపించారు. ఆదివారం యువసేన నాయకులు బాధితురాలికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో యువసేన నాయకులు రఘుయాదవ్, జె ఆశన్న, సూక్యానాయక్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వెల్టూర్‌లో..

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వెల్టూర్ గ్రామానికి చెందిన మునగాల స్వరాజ్(25)వారం రోజుల క్రితం మృతిచెందాడు. ఈ విషయం స్థానిక కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి జి.చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన చిన్నారెడ్డి తక్షణ సాయంగా రూ.5వేలు పంపించారు. ఆ నగదును కాంగ్రెస్ నాయకులు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పెంటన్న, మన్నెం, శ్రీనివాసులు, దయాకర్, జగదీశ్వర్‌రెడ్డి, రమేష్, విజయ్‌కుమార్, లక్ష్మయ్య, నాగన్న ఉన్నారు.